క్లుప్తంగా

24న సామాజిక తనిఖీ గ్రామ సభ

మాడుగుల రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులకు సంబంధించి మండల స్థాయి సామాజిక తనిఖీ గ్రామ సభ ఈ నెల 24న స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.అప్పారావు తెలిపారు. 17వ విడత మండలంలో 2023–24 మధ్య చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ చేశారన్నారు. ఈ నెల 17వ తేదీ నుంచి పంచాయతీల్లో క్షేత్ర స్థాయి తనిఖీలు గ్రామ స్థాయి సామాజిక తనిఖీ బృందం సభ్యులు ప్రతి వేతన దారునితో మాట్లాడి సర్వే చేశారన్నారు.

సంత వేలం ఖరారు

మాకవరపాలెం: మండల కేంద్రం మాకవరపాలెంలో ప్రతి మంగళవారం జరిగే వారపు సంత వేలం ఖరారైంది. సంతలో దుకాణాల వద్ద ఆశీలు వసూలుకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. ఈ వేలంలో 18 మంది పాటదారులు పోటీపడ్డారు. ఈ సందర్భంగా జరిగిన వేలంలో కశింకోట మండలం తాళ్లపాలెం గ్రామానికి చెందిన గళ్లా కన్నాజీ రూ.2.68 లక్షలకు వేలం దక్కించుకున్నారు. గతేడాది ఈ వేలం ద్వారా రూ.2.75 లక్షల ఆదాయం వచ్చినట్టు ఎంపీడీవో సీతామహాలక్ష్మి తెలిపారు.

26న మండల సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషశ్రీ

నాతవరం: ఈ నెల 26న మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఉషశ్రీ తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటలకు ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు విధిగా హాజరుకావాలన్నారు. అలాగే సమావేశానికి వచ్చే ఆయా శాఖల అధికారులు గత సమావేశంలో సభ్యులు అడిగిన సమస్యలకు సంబంధించి పూర్తి సమాచారంతో రావాలని సూచించారు. ఈ సమావేశంలో మండల వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యలపై చర్చిస్తామన్నారు.

అక్రమ తాగునీటి కనెక్షన్లపై చర్యలు


అక్రమ కనెక్షన్లను పరిశీలిస్తున్న కార్యదర్శి ప్రసాద్

మాకవరపాలెం: అక్రమంగా తాగునీటి కనెక్షన్లు ఏర్పాటు చేస్తే చర్యలు తప్పవని మల్లవరం పంచాయతీ కార్యదర్శి ప్రసాద్ స్పష్టం చేశారు. గ్రామంలో ప్రజలకు తాగునీరు అందించే పైపులైన్ల ద్వారా అక్రమంగా కనెక్షన్లు ఇళ్లలోకి అమర్చుకోవడంతో గ్రామంలో పూర్తిస్థాయిలో ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అక్రమ కనెక్షన్లపై అందిన ఫిర్యాదుతో గురువారం కార్యదర్శి ఇంటింటికీ వెళ్లి అక్రమంగా ఏర్పాటు చేసుకున్న కనెక్షన్లను పరిశీలించారు. కొందరు వ్యవసాయ భూములకు పైపుల ద్వారా తాగునీటిని మళ్లించిన విషయాన్ని కూడా గుర్తించారు. అక్రమ కనెక్షన్లు వెంటనే తొలగించి, ప్రజలకు సక్రమంగా తాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామన్నారు.

రాయితీపై వ్యవసాయ పరికరాలు

మాడుగుల రూరల్: వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా మండలానికి వివిధ రకాల 73 పరికరాలు మంజూరయ్యాయని ఏవో ఎం.వాసుదేవరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్యాటరీ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, బ్రష్ కట్టర్, పవర్ టిల్లర్లు, పవర్ వీడరు, రోటోవేటర్, ట్రాక్టర్ అనుబంధ పరికరాలు రాయితీపై రైతులకు అందించనున్నట్టు పేర్కొన్నారు. పరికరాలు కావాల్సిన రైతులు తమ దగ్గర్లోని రైతు సేవా కేంద్రాలల్లో పని చేస్తున్న వీఏఏ, వీహెచ్ఏలను సంప్రదించి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

తెలుగు, గణితంపై ఉత్తమ బోధన అవసరం


చిన్నారులు నేర్చుకున్న విషయాలు తెలుసుకుంటున్న ఎంఈవో జగ్గారావు

రోలుగుంట: తెలుగు, గణితంపై విద్యార్థులకు ఉత్తమ బోధన చేయాలని ఉపాధ్యాయులకు ఎంఈవో జగ్గారావు సూచించారు. గురువారం ఆయన పడాలపాలెం కొండపాలెం, కొమరవోలు ఎంపీపీ పాఠశాలలను సందర్శించారు. ఈ నెల ఒకటి నుంచి అమలవుతున్న కొత్త మెనూపై ఆరా తీశారు. విద్యార్థులకు తెలుగు, గణితం బోధనపై అవసరమైన సూచనలు చేశారు. దీనిలో భాగంగా పడాలపాలెం ఎంపీపీ పాఠశాలలో విద్యార్థుల నేర్చుకున్న విషయాలపై చర్చించి తెలుసుకున్నారు. విద్యార్థులను ఏ, బీ, సీ, డీగా విభజించి అందరినీ చైతన్య పరచాలని ఉపాధ్యాయులకు సూచించారు.

మామిడి పూతకు మంచు దెబ్బ


మామిడి చెట్టుకు పూసిన పూత


తాటిపర్తిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న మండల ఉద్యానవన శాఖాధికారి భాను పుష్పలీలావతి

- మాడిపోయి రాలిపోతున్న పిందెలు
- సకాలంలో సస్యరక్షణ చర్యలతోనే ఫలితం

మాడుగుల రూరల్: మామిడి పూతపై పొగమంచు తీవ్ర ప్రభావం చూపిస్తోంది. పూత, పిందెలు రాలిపోయి తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. రాత్రి వేళల్లో పొగమంచు అధికంగా కురుస్తోంది. దీంతో మామిడి రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది వాతావరణ పరిస్థితులు మామిడి రైతులకు అనుకూలించడం లేదు. గతేడాది డిసెంబర్‌లో పూయాల్సిన మామిడి పూత జనవరి నెలాఖరులో పూసింది. ఆలస్యంగా పూత విరబూసింది. దీంతో రైతులు మామిడి దిగుబడులు పెరుగుతాయని ఆశపడ్డారు. అయితే వచ్చిన పూత రాలిపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. పూత రాలిపోయి కాడలు కనిపిస్తున్నాయి. మండలంలో శంకరం, అవురువాడ, తాటిపర్తి, పొన్నవోలు, కింతలి, వల్లాపురం, పొంగలిపాక, తాటిపర్తి, తదితర గిరిజన గ్రామాల్లో ఎక్కువగా మామిడి తోటలు ఉన్నాయి. అలాగే ప్రతి రైతు తమ పొలాల్లో కనీసం రెండు చొప్పున మామిడి చెట్లు పెంచుతుంటారు. ఒక ఎకరా మామిడి తోటలో దుక్కులు, కూలీలు, మందులు, తదితర వాటికి సుమారు రూ.25 వేలు నుంచి రూ.30 వేలు వరకు ఖర్చు చేశారు. ఒక కాడకు పది పిందెలు నిలిస్తే, అవి కూడా పాలిపోయిన రంగులో రాలిపోతున్నాయని రైతులు వాపోతున్నారు.

సస్యరక్షణ చర్యలు ఇలా..

మామిడి పూత రాలకుండా ఉండడానికి సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల ఉద్యానవన శాఖాధికారి వి.భానుపుష్పలీలావతి గురువారం రైతులకు అవగాహన కల్పించారు. వాతావరణ పరిస్థితులను బట్టి మామిడి పంటకు బట్టిమంగు, మసి, పండు ఈగ, పెంకు, తేనే మంచు పురుగు, కాండం తొలుచు పురుగు, గూడు పురుగు, వంటి ఇతర రసం పీల్చే పురుగులు ఉధృతి మరి ఎక్కువగా కనిపిస్తుంది. దీని ఫలితంగా పూత మాడిపోయి పిందెలు రాలిపోతున్నాయి. ఈ విధంగా సస్యరక్షణ చర్యలు తీసుకుంటే చీడపీడలు, పొగమంచు నుంచి పంటను కాపాడుకోవచ్చునని ఆమె తెలిపారు. అజాడిరిక్టిన్ రెండు మిల్లీలీటర్లు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. పురుగుల ఉధృతిని నియంత్రించేందుకు ఎకరాకు 8 పండు ఈగబుట్టలు పెట్టుకోవాలి. పిందెలు ఎక్కువగా రాలిపోతుంటే నాప్తలిన్ ఆసిటిక్‌యాసిడ్(ప్లానోఫిక్స్) 100 ఎంఎల్, 500 లీటర్ల నీటిలో 50 చెట్లకు పిచికారీ చేయాలన్నారు. తేనే మంచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉంటే డైనోటోఫ్యూరాన్ 0.25 గ్రాములు ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుందన్నారు. నల్లతామర ఉధృతి ఎక్కువగా ఉంటే చెట్టుకొక బ్లూ కలర్ జిగురు అట్ట అమర్చుకోవాలని ఎంహెచ్‌వో భాను పుష్పలీలావతి మామిడి రైతులకు అవగాహన కల్పించారు.

గోవాడ సుగర్ ఫ్యాక్టరీని కాపాడుకోవాలి


చౌడువాడలో రైతులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకుడు ముత్యాలనాయుడు

కె.కోటపాడు : గోవాడ సుగర్ ఫ్యాక్టరీని కాపాడుకునేందుకు ఈ నెల 21న ఫ్యాక్టరీ వద్ద సభ్య రైతులతో కలిసి నిర్వహిస్తున్న మహాధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు కోరారు. చౌడువాడ, మల్లంపాలెం, పైడంపేట, గొండుపాలెం గ్రామాల్లో గురువారం పార్టీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీని నష్టాల పేరు చెప్పి కారుచౌకగా కొట్టేసేందుకు కూటమి నాయకులు గెద్దల్లాగ చూస్తున్నారని ఆరోపించారు. మాడుగుల, చోడవరం ఎమ్మెల్యేలు అసెంబ్లీ సమావేశాల్లో ఫ్యాక్టరీ ఆధునికీకరణ, చెరకు బకాయిలపై నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఫ్యాక్టరీని కాపాడతామని చెప్పి ఓట్లేయించుకున్న ఎంపీ సీఎం రమేష్ ప్రస్తుతం రైతులకు ఎక్కడా కనిపించడం లేదని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యర్రా దేముడు, గండి నాయినిబాబు, తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా విజయవంతానికి పిలుపు


వడ్డాది కాటా వద్ద కరపత్రాలు పంపిణీ చేస్తున్న రైతు సంఘం నాయకులు

బుచ్చెయ్యపేట: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ సమస్యలపై శుక్రవారం జరిగే మహాధర్నాను విజయవంతం చేయాలని జిల్లా రైతు సంఘం సభ్యుడు ఎస్.వి.నాయుడు, మండల అధ్యక్షుడు పినపాత్రుని సాంబశివరావు పిలుపునిచ్చారు. ఈ మేరకు వడ్డాది, బంగారుమెట్ట, విజయరామరాజుపేట, తదితర గ్రామాల్లో గురువారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు, కార్మికుల బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమములో రైతు సంఘం నాయకులు పి.సాంబశివరావు, అప్పలనాయుడు, వి.సత్యం పాల్గొన్నారు.

24 నుంచి ఉచిత ఎంసెట్ కోచింగ్

నర్సీపట్నం: ఎస్ఏఎస్ ఎడ్యుకేషనల్ సొసైటీ, చారిటీ ఆధ్వర్యంలో ఇంటర్మీడియెట్ పూర్తి చేసిన విద్యార్థులకు ఉచితంగా ఎంసెట్ కోచింగ్ ఇస్తున్నామని, ఆసక్తి గల వారు సద్వినియోగం చేసుకోవాలని సొసైటీ ఫౌండర్ సూరెడ్డి అప్పలనాయుడు, కరస్పాండెంట్ ఉమామహేశ్వరి, ఆర్గనైజర్ కృష్ణ తెలిపారు. ఈ నెల 24 నుంచి నర్సీపట్నం మున్సిపాలిటీ రామారావుపేటలో తరగతులు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 91823 96247, 94932 95638 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని వారు కోరారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ గ్రామ సభ


కె.జె.పురం సచివాలయంలో జరిగిన సామాజిక తనిఖీ గ్రామ సభలో మాట్లాడుతున్న డీఆర్‌పీ రమేష్

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామ సచివాలయంలో గురువారం ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ గ్రామ సభ నిర్వహించారు. ఈ గ్రామ సభలో జిల్లా రిసోర్స్ పర్సన్ ఆర్.రమేష్ మాట్లాడుతూ 2023–24 ఆర్థిక సంవత్సరంలో గ్రామంలో 118 పనులు చేపట్టామని, ఇందు కోసం రూ.88 లక్షలు ఖర్చు చేశామన్నారు. 856 మందికి జాబ్‌కార్డులు ఉన్నాయన్నారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధి హామీ పథకం లబ్ధిదారులు మాట్లాడుతూ కూలీ గిట్టుబాటు కావడం లేదని, తక్షణం పెంచాలని కోరారు. మూడు మాసాల నుంచి వేతనాలు అందడం లేదని సభ దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక సర్పంచ్ జామి రమణబాబు అధ్యక్షతన జరిగిన ఈ గ్రామ సభలో పంచాయతీ కార్యదర్శి బి.నవీన్‌దొర, పంచాయతీ పాలకవర్గ సభ్యులు సూరిశెట్టి గోవిందరాజులు, స్థానిక నాయకులు మళ్ల కన్నబాబు, కాళ్ల అప్పలనాయుడు, రాపేట జోగినాయుడు, శరగడం ఆదిబాబు, యల్లపు రాము, కాళ్ల హరిబాల, ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్ టి.లక్ష్మి, వీఆర్‌పీ బి.శ్రీనివాసరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

బోధన సామర్థ్యాలు పెంపొందించుకోవాలి


ఎం.కోడూరులో అంగన్‌వాడీ కార్యకర్తలకు బోధన సామగ్రి అందిస్తున్న సీడీపీవో శ్రీదేవి, తదితరులు


బుచ్చింపేటలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్లు పోషణ్ భీ.. పడాయి భీపై శిక్షణ


నర్సీపట్నంలో శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ఎం.రాజేశ్వరి

మాడుగుల: అంగన్‌వాడీ కార్యకర్తలు బోధన సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో సీహెచ్.శ్రీదేవి సూచించారు. మండలంలో ఎం.కోడూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మూడు రోజుల పాటు జరగనున్న పోషణ్ భీ, పడాయి భీ శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమయ్యాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు సరైన పోషణ అందించడానికి ఈ శిక్షణ ఉపయోగపడుతుందన్నారు. బరువు తక్కువ ఉన్న, రక్తహీనత ఉన్న పిల్లలకు సరైన పోషణ ఎలా అందించాలో తెలియజేశారు. ఆడియో, వీడియోలతో పాటు దృశ్య శ్రవణం ద్వారా ఈ శిక్షణ కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు డి.నారాయణమ్మ, బి.ఈశ్వరమ్మ, అంగన్‌వాడీ కార్యాలయ సిబ్బంది విశ్వనాథం, కార్తీక్, హెచ్‌ఎం శ్రీనివాస్, 50 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కె.కోటపాడు : అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషన్ భీ పడాయి భీ కార్యక్రమంపై శిక్షణ తరగతులను కె.కోటపాడు ఐసీడీఎస్ కార్యాలయంలో పీవో మంగతాయారు ప్రారంభించారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

రోలుగుంట: నర్సీపట్నం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుచ్చింపేట సెక్టార్‌లోని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆ శాఖ సూపర్‌వైజర్లు రమ్య, హేమ పోషణ్ భీ.. పడాయి భీ అనే అంశంపై శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. చిన్నారులకు పోషకాహారం అందించడం, అక్షర జ్ఞానం కల్పించడంపై అవగాహన కల్పించారు. చిన్నారులకు ప్రేమాభిమానాలు చూపించి తల్లులను మరిపించేలా వాళ్లతో ఎలా మెలగాలి అనే అంశంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు.

నర్సీపట్నం: అంగన్‌వాడీ కార్యకర్తలు సామర్థ్యాలను పెంపొందించుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎం.రాజేశ్వరి అన్నారు. ఐసీడీఎస్ కార్యాలయంలో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పోషణ్ భీ పడాయి భీ కార్యక్రమంపై అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ మాట్లాడుతూ పిల్లలకు అందించే పౌష్టికాహారంపై దృష్టి సారించడంతో పాటు ప్రీస్కూల్ పిల్లలకు నాణ్యమైన విద్యను అందించేందుకు నైపుణ్యాలు పెంపొందించుకోవాలన్నారు. బాల్య సంరక్షణ, విద్య, అంగన్‌వాడీ కేంద్రాల్లో అనుసరించాల్సిన పద్ధతులపై ప్రాథమిక అవగాహన కలిగి ఉండాలన్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ పబ్లిక్ కోఆపరేషన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్ రూపొందించిన నిర్వహణ బాధ్యతలపై సంపూర్ణ అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ సరోజని, ప్రసాద్, ప్రాజెక్టు పరిధిలోని 164 మంది అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మరిడిమాంబ తీర్థం


మరిడిమాంబను దర్శించుకుంటున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, తదితరులు

మాడుగుల: మాడుగుల పట్టణం సమీప పంట పొలాల్లో కొలువుదీరిన మరిడిమాంబ తీర్థం గురువారం ఘనంగా జరిగింది. రైతు సంఘం సభ్యుల ఆధ్వర్యంలో ఆలయం వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు, తదితరులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిడిమాంబ చల్లని తల్లని, రైతుల కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి అని కొనియాడారు. పండగలు, తీర్థాల నిర్వహణతో ఆనాటి సంప్రదాయాలు నేటి తరానికి తెలుస్తాయన్నారు. అనంతరం బూడి ముత్యాలనాయుడును రైతులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ వేమవరపు రామధర్మజ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు బొమ్మిశెట్టి శ్రీనివాసరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఎంపీటీసీ పొలిమేర విజయలక్ష్మి, జిల్లా ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు పడాల అప్పలనాయుడు, కాళింగ కల్యాణ రాజు, రైతులు పాల్గొన్నారు.

జీడి మామిడి తోటలు దగ్ధం

రావికమతం: మండలంలో చినపాచిలిలో గురువారం సంభవించిన అగ్ని ప్రమాదంలో జీడి మామిడి తోటలు కాలి బూడిదయ్యాయి. ప్రమాదవశాత్తు చెలరేగిన మంటలకు ఎస్.సత్యారావు, శివయ్యనాయుడు, చిన్న సత్యారావు, నల్లప్ప నాయుడుకు చెందిన జీడి మామిడి తోటలు దగ్ధమయ్యాయి. పంట కాపుకొచ్చే సమయంలో అగ్నిప్రమాదం జరగడం వల్ల ఆర్థికంగా నష్టపోయామని రైతులు వాపోయారు.

బీసీ రుణాల దరఖాస్తులకు రేపే గడువు

దేవరాపల్లి: బీసీ కార్పొరేషన్ల రుణాలు పొందేందుకు ఆసక్తి ఉన్న వారు శనివారంలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో ఎం.వి.సువర్ణరాజు ఓ ప్రకటనలో తెలిపారు. మండలానికి 91 కార్పొరేషన్ రుణాల యూనిట్లు కేటాయించారని, వీటికి సంబంధించి రూ.1.74 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ రుణాలకు 50 శాతం సబ్సిడీ వర్తిస్తుందన్నారు. బీసీలతో పాటు కాపు–3, కమ్మ, క్షత్రియ, రెడ్డి, వైశ్య సామాజిక వర్గాలకు ఒక్కొక్క యూనిట్ కేటాయించారన్నారు. ఆసక్తి ఉన్న ఉన్నవారు వెబ్‌సైట్ apobmms.apcfss.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్, రేషన్‌కార్డు జత చేయాలని ఎంపీడీవో సూచించారు.

కె.జె.పురం కూడలిలో ఆక్రమణలపై సర్వే


కె.జె.పురం జంక్షన్‌లో సర్వేలో భాగంగా మార్కింగ్ చేస్తున్న ఆర్‌అండ్‌బీ సిబ్బంది

మాడుగుల రూరల్: మండలంలో కె.జె.పురం జంక్షన్‌లో అక్రమ నిర్మాణాలు తొలగించడంలో భాగంగా ఆర్ అండ్ బీ సిబ్బంది, స్థానిక పంచాయతీ అధికారులు సంయుక్తంగా గురువారం సర్వే నిర్వహించారు. వడ్డాది–పాడేరు ఆర్‌అండ్‌బీ రహదారి కె.జె.పురం జంక్షన్ వద్ద ఆక్రమణకు గురైందని స్థానిక కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయ ధర్మకర్త రాపేట రామకొండలరావు ఈ నెల 10న కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. జంక్షన్‌లో రోడ్డును ఆనుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని, ప్రజా ప్రయోజనం దృష్ట్యా ఆక్రమణలు తొలగించాలని కోరారు. ఈ ఫిర్యాదు మేరకు మాడుగుల ఆర్‌అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్, వర్క్ ఇన్‌స్పెక్టర్ పైలా దేముడునాయుడు, సిబ్బంది లాలం నాయుడు, పంచాయతీ కార్యదర్శి నవీన్‌దొర, వీఆర్‌వో నాగప్పారావు, సర్వేయర్లు తనూజ, రాజేశ్ సర్వే చేశారు. సర్వే ప్రకారం రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 11 మీటర్లు మేర రోడ్డు విస్తరణకు సంబంధించి మార్కింగ్ చేశారు.

‘ధనిమిరెడ్డీ.. నోరు అదుపులో పెట్టుకో’

వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు అల్లంపల్లి ఈశ్వరరావు



నర్సీపట్నం: టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు నోరు అదుపులో పెట్టుకోకపోతే అదే రీతిలో స్పందించవలసి వస్తోందని వైఎస్సార్‌సీపీ టౌన్ యూత్ నాయకుడు అల్లంపల్లి ఈశ్వరరావు అన్నారు. మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్‌ను విమర్శించే స్థాయి ధనిమిరెడ్డికి లేదన్నారు. మాజీ ఎమ్మెల్యే గణేష్‌పై అవాకులు, చవాకులు మాట్లాడితే ఊరుకునేదిలేదని ఆయన హెచ్చరించారు. నూకాలమ్మ ఆలయ విరాళాలపై స్పీకర్ సిహెచ్. అయ్యన్నపాత్రుడు చేసిన ఆరోపణలకు మాజీ ఎమ్మెల్యే గణేష్ బదులిచ్చారని, మధ్యలో నీకెందుకు అని ప్రశ్నించారు. మధు స్థాయి కార్యకర్తకు ఎక్కువ.. కౌన్సిలర్‌కు తక్కువ అంటూ ఎద్దేవా చేశారు. పవర్‌ఫుల్ అమ్మవారైన నూకాలమ్మ తల్లితో పెట్టుకుంటే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు.

గ్రామాభివృద్ధికి ఇంటి పన్నులు చెల్లించాలి

మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ జామి అప్పారావు



దేవరాపల్లి: ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి గ్రామాభివృద్ధికి సహకరించాలని ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీ జామి అప్పారావు కోరారు. ఇన్‌చార్జ్ ఈవోపీఆర్డీగా తాజాగా బాధ్యతలు స్వీకరించిన ఆయన గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడారు. మండలంలోని 27 పంచాయతీలలో రూ.92,25,748 లక్ష్యంగా కాగా.. రూ.53,00,720 ఇంటి పన్నుల బకాయిలను వసూలు చేశామన్నారు. నెలాఖరులోగా శతశాతం ఇంటి పన్నుల బకాయిలను వసూలు చేయాలని పంచాయతీరాజ్ కమిషనర్, జిల్లా పంచాయతీ అధికారి నుంచి ఆదేశాలు వచ్చాయని చెప్పారు. డిమాండ్ నోటీస్ అందజేసిన 15 రోజుల్లోగా పన్ను చెల్లించాలని, లేకుంటే కోర్టు ద్వారా నోటీస్ జారీ చేస్తామన్నారు. వేసవి దృష్ట్యా గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశామన్నారు. తాగునీటి సమస్యపై ఫిర్యాదు చేసేందుకు ఎంపీడీవో కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ సెల్ నంబర్ 76609 22382కు సమాచారం అందించాలన్నారు. స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి రోజూ తడి, పొడి చెత్తను వేరు చేసి, హరితరాయబార్లకు అందించాలని ఆయన కోరారు.

‘వర్గీకరణలో రెల్లి కులస్తులకు అన్యాయం’


విలేకరులతో మాట్లాడుతున్న కోటేశ్వరరావు

కె.కోటపాడు : ఎస్సీ వర్గీకరణలో రెల్లి కులానికి తీరని అన్యాయం జరిగిందని రెల్లి హక్కుల రిజర్వేషన్ పోరాట సమితి మండల అధ్యక్షుడు వడ్డాది కోటేశ్వరరావు విమర్శించారు. కె.కోటపాడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అన్ని రంగాల్లోను వెనకబడిన రెల్లి కులస్తులకు ఎస్సీ వర్గీకరణ ద్వారా మేలు జరుగుతుందని ఆశించామని, తీరా ఒక శాతం రిజర్వేషన్ కేటాయించడం అన్యాయమన్నారు. మాలలకు 6.5 శాతం, మాదిగలకు 7.5 శాతం రిజర్వేషన్ కల్పించారని చెప్పారు. ఎస్సీ వర్గీకరణపై మంత్రుల కమిటీ పునరాలోచన చేసి రెల్లి కులస్తులకు రిజర్వేషన్‌ను పెంచాలని ఆయన కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు సిద్ధం కానున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భూపతి కోటేశ్వరరావు, త్రినాథ, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజుకు పరామర్శ


ములకలాపల్లి వైఎస్సార్‌సీపీ నేత మజ్జి రాజును పరామర్శిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ నాయకుడు, ములకలాపల్లి ఎంపీటీసీ మజ్జి దేవి భర్త రాజును మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బూడి ముత్యాలనాయుడు గురువారం పరామర్శించారు. రాజు ఇటీవల అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో వైద్య సేవలు అనంతరం ములకలాపల్లిలోని ఇంటికి చేరుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయనను బూడి కలిసి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరగా కోలుకోవాలని ధైర్యం చెప్పారు. ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి, జెడ్పీటీసీ కర్రి సత్యం, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, ఎ.కొత్తపల్లి సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, స్థానిక సర్పంచ్ గొర్లె అన్నపూర్ణ పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలతో అవస్థలు


రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలు

నాతవరం: కోట్లాది రూపాయలతో నిర్మించిన రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలను మార్పు చేయకపోవడంతో ప్రమాదాలకు నిలయంగా మారాయి. చమ్మచింత గ్రామం నుంచి సరుగుడు పంచాయతీ వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు విస్తరణ కోసం ప్రభుత్వం రూ.12 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో ఇటీవల కాలంలో తారు రోడ్డు విస్తరణ పనులు చేశారు. చమ్మచింత గ్రామంలో గ్రామస్తుల అభీష్టం మేరకు తారురోడ్డుకు బదులుగా సిమెంట్ రోడ్డు నిర్మించారు. పాత రోడ్డులో ఉండే విద్యుత్ స్తంభాలు మార్పు చేయకుండా సిమ్మెంటు రోడ్డు నిర్మించారు. ప్రస్తుతం ఈ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు దర్శనమిస్తుండడంతో ఏ సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. రాత్రి వేళలో విద్యుత్ లేని సమయంలో ఆదమరిచి వాహనాలు నడిపితే స్తంభాలను ఢీకొట్టే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న విద్యుత్ స్తంభాలకు పక్కకు మార్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.